# వెంకయ్య వెలి

వెంకయ్య సంసారంమీద పిడుగు పడింది. అనుకోనిచోట్ల పడే అలవాటు కల పిడుగుకి వెంకయ్య సంసారం మీదే పడడం అంత కొత్త విషయమేమీ కాదు. కాని వెంకయ్య సంసారం మాత్రం ఆ పిడుగు తాకిడికి తట్టుకోలేకపోయింది.

తామరవ్యాధి ముదిరినా సా బాధపడుతూ వైద్యానికై తన వద్దకు వచ్చిన వెంకయ్యని పరీక్షించి, అతడికి పెద్ద జబ్బు వచ్చిందని జోస్యపు ఆచార్యులుగారు చెప్పారు. ఆచార్యులుగారికి జ్యోతిశ్శాస్త్రంలో పాండిత్యంతో పాటు కొస్త మాత్ర నలిపి ఇవ్వడంలో కూడా ప్రావీణ్యం ఉంది. ధన్వంతరి మరణించడం తాము అవతరించడానికేనని ఆచార్యులుగారికి శల్యాల్లో బాగా జీర్ణించిన సత్యం. అదృష్టవశాత్తూ మన కథకు ఆయన జీర్ణ సత్యాలతో నిమిత్తమేమీ లేదు.

వెంకయ్య కుటుంబానికి అంటే వెంకయ్య భార్య మంగమ్మకు ఆచార్యులుగారి జోస్యం మీద వీసమెత్తు నమ్మకం కూడా లేదు. ఎనకో పాలి మంగమ్మ తమ్ముడు సూరిగాడికి పదహారో ఏటే పెళ్ళవుతుందని ఆచార్యులుగారు జోస్యం చెప్పారు. ఆడికి ముప్పై ఏళ్ళు ముడ్డి క్రిందకి వచ్చినా పెళ్ళి మాత్రం ఇంకా ఇంకా దూరం అవుతూ ఉంది. కాని, ఆయన వైద్యంలో మాత్రం చచ్చేవంత గురి ఉంది మంగమ్మగారికి. వెంకయ్య కుటుంబంలోనివారికి ఏ మందు ఇచ్చినా ఆయన చిల్లి డబ్బు అయినా పుచ్చుకోరు. పావుకారు వెంకయ్యదుకాణంలో ఆయనకు బోలెడంత పరపతి ఉండడానికి కూడా ఇదే కారణమయింది. అదే విధంగా సంవత్సరాల తరబడి దుకాణం మీద వాడుకున్న సరుకులకుగాను ఆయన వెంకయ్యకు చిల్లి డబ్బు అయినా ఏ నాడు ముట్ట చెప్పిన పాపాన పోలేదు. ఈ సంగతి మంగమ్మకి తెలియదు. తెలిస్తే ఆచార్యులుగారి వైద్యం మీద ఆవిడ కంత కాలం నమ్మకం ఉండకపోనేమో కూడా.

ఆచార్యులు రోగులను ముట్టుకోనకుండానే, అల్లంత దూరాన చూచి, వచ్చిన జబ్బేమిటో తెలుసుకుని, తన్నివారణకు రామబాణంలాంటి మందు ప్రయోగించగలరు (ఆయన అలాంటి రామబాణాలతో ఆ గ్రామంలో చాలా మంది వాలి రావణ మారీచాది రాక్షసులను హతమార్చినట్లు ప్రతీతి కూడా ఉంది) ముట్టుకోడానికైతే ఆచార్యులుగారికి అభ్యంతరం లేదు. కాని, ముట్టుకోకుండానే సంక్రమించి, నానా బాధలూ పెట్టే వెంకయ్య కుటుంబపు తామర ముట్టుకుంటే ఏ విధంగా పరిణమిస్తుందోనని ఆయన భయం. అసలా తామరే వెంకయ్యవిషయంలో కుష్టుగా మారిందని ఆయన సెలవిచ్చారు.

అంటే ఆమరుక్షణమే మంగమ్మ తన భర్త అయినటువంటి వెంకయ్యను వెలి వేసింది. తన భార్య ఎంతో మంచిదని వెంకయ్య అనుకునేవాడు. కాని ఆచార్యులుగారి రోగనిదాన ఫలితంగా ఆ మంచి అంతా చెడుగా మారిందని వెంకయ్య భయపడవలసిన అవసరం వచ్చేసింది.

పెద్ద జబ్బు వచ్చిన వెంకయ్యని చూచి మొదట చాలా ఏడ్చింది మంగమ్మ. కన్నీళ్ళు కారడం మానివేసిన తరువాత ఊరికే ఏడుస్తున్నట్లు మూలిగింది. ఆ మూలుగు కాలంలోనే వెంకయ్యమీద ఒక రకం అసహ్యం బయలుదేరింది. స్వభావతః మంచిది కావడంవల్ల ఆ అసహ్యం చంపుకుని, జాలిపడింది. అయ్యో, నా రాత ఇంత అయిందా అనే ఏడుపు ఎక్కువ అయ్యేసరికి ఆ జాలి కూడా నశించి, భర్తను సరిగా కంటితో చూడడం కూడా మానేసింది. కంటితో అని చెప్పడానికి ప్రత్యేక కారణం ఉంది. ఆమెకు ఒక్క కన్నే. రెండో కన్ను చిన్నతనంలో తమ్ముడు వీర్రాజు గాడి గోటిబిళ్ళకి బలి అయింది.

అయితే మంగమ్మ వెంకయ్యని వెలి వేయడానికి అసలు కారణం వేరు. "సరే. వచ్చిన జబ్బు ఎలాగూ వచ్చింది. ఇక పొమ్మన్నా పోదని ఆచార్యులుగారు కూడా చెప్పారాయె. కాని, తన కడుపున పుట్టిన కూతురు, తన చీము నెత్తురు తామర పంచుకుని జన్మించిన ముద్దుల కుమార్తె పుల్లమ్మకు ఆ జబ్బు అంటుకుంటే ఏమిటి చేయడం" అని ఆమెకు భయం కలిగింది.

పుల్లమ్మ పేరుకొక చరిత్ర ఉంది. పుల్లమ్మకు కీర్తిశేషుడు తాతగారైన పుల్లయ్య (ఆయన గడించి మిగిల్చినది అది ఒక్కటే) పేరు పెట్టారు. ముద్దుకి పుల్లి అనే వారు. కొందరు కిట్టని వాళ్ళు పులి అనడం కూడా కద్దు. తామర బగ్గీలు పులి చారలని వారు భ్రమపడిఉండవచ్చు.

ఏదైనా వెంకయ్యని వెలివేసిన మంగమ్మని ఏమనడానికి వీలులేదు. అగ్నిసాక్షిగా వివాహంమాడినందుకు ఒక ఏడుపు ఏడిచేసింది. అంతే కాని వెంకయ్యకోసం తన జీవితం కాని, తన కుమార్తె జీవితం కాని పాడు చేసుకొని, వెంకయ్యని ఇంట్లోనే ఉంచుకోనడం ఆమె ఒంటికంటి దృష్టిలో అంత సబబైన విషయంగా గోచరించలేదు.

వెంకయ్య అయినా మంగమ్మకోసం ప్రాణత్యాగం చేసేటంత ప్రేమ కలిగినవాడు కాడు. అసలు మంగమ్మతో చే

"తూలికాభూషణ్"

వెంకయ్యకు తామరా సిరీ అబ్బాయి. మంగమ్మ గడపదాటి కుడి కాలు లోపల పెట్టడం, ఆ కుటుంబంలో తామర ప్రవేశించడము ఒక్కసారే జరిగాయి. సిరికల తామరవద్దనే వారు లేరు. అందులోనూ నాలుగు తరాలుగా జంగెడ బుజంమీద పెట్టుకుని చేగోడీలు అమ్ముకున్న వెంకయ్య కుటుంబానికి సిరి విలువ తెలుసు. పైగా మంగమ్మకు సిరి ఉన్న విషయమే కాని, తామర ఉన్న విషయం ఆ నాటికి వెంకయ్య కుటుంబంలోనివారికి తెలియదు. అప్పట్లో అది నిక్షిప్త ధనంగా ఉండేది.

తండ్రి డబ్బుతో భర్త సంసారానికి ఏకు మేకై కూర్చుంది మంగమ్మ. మంగమ్మ అధికారం కాదనగలిగే ధీమాయే ఉంటే వెంకయ్యకు ఆదిలోనే తామర బాధ తప్పును. అయినా అదేమి వ్యాధో కాని ఎన్ని మందులు వాడినా అది మళ్ళీ మళ్ళీ అందరికీ అంకురిస్తూనే ఉండేది. వెంకయ్యకి మాత్రం క్రమంగా ఆ తామర మీద ఒక విశ్వాసం ఏర్పడింది. దానితోటే సిరి రావడం, తిరిగి దానితో పాటే సిరి కూడా వృద్ధి చెందడం అతని విశ్వాసం బలపడడానికి కారణమయ్యాయి. క్రమేణా అతనికి దాని మీద ఒక రకమైన భక్తి కూడా ఏర్పడింది. అప్పటినుంచి ఆ ఇంటిలో తామరమందుకు స్థానం లేకుండా పోయింది. వెంకయ్య దుకాణంలో తామర మందు విక్రయమూ లేదు.

కాని, అనుకోకుండా ఆ భాగ్యదేవత కరుణాకటాక్ష వీక్షణం ఇలా పరిణమించింది. మరోకవంక విచారంతోపాటు భర్తపై మంగమ్మ అధికారంకూడా ఇనుమడించింది. భర్తపై తనకున్న అధికారం ఎలాంటిదో మంగమ్మకు తెలుసు. అందుచేత కేవలం అధికారమదంవల్లనే భర్తను వెలివేసినదని చెప్పడానికి అవకాశమేమీ లేదు. అసలు కారణం పుల్లమ్మ పెళ్ళే కాని అన్యం కాదు. కేవలం తామరవంటి సిరికల జబ్బు మాత్రమే ఉంటే బాధపడని వారు చాలామంది ఉండవచ్చు కాని ఇది వేరే విషయం.

మంగమ్మ వెలివేయడంతో వెంకయ్య సంవత్సరాల తరబడి నిర్మించుకున్న ఊహాసౌధాలు కూలిపోయి, అతని జీవితం ధ్వంసం కావలసిందే. అతని కలలు కల్లలుగా మారవలసిందే సమాజంలోని ఎందరో అభాగ్యుల జీవితాలకు చిహ్నంగా వెంకయ్య వెలిగురించి సమాజాత్మ తత్వ జిజ్ఞాస కలిగిన ఒక మహాకవి ఒక మహాకావ్యం విరచించి, కన్నీరు కార్చవలసిందే. ఆంధ్రదేశ దురదృష్టంవల్ల అలాంటి పరేంగిత జ్ఞానం కలిగిన మహాకవి ఎవరూ ఇంత వరకు జన్మించలేదు. అలాంటి మహాకావ్యరచన కూడా జరిగింది కాదు.

భార్య వేసిన వెలికారణంగా వెంకయ్య మొదట కొంచెం బాధపడిన మాట నిజం. క్రమేపి ఈ వ్యాధి అతనికి తలవని తలంపుగా ఒక మహా ఉపకారం చేసిపోయింది. పూర్వం రోజుకు ఒక్క పుగాకు ముక్కకన్న ఎక్కువ ఉపయోగించడానికి అతనికి అనుమతి ఉండేది కాదు. ఒక్క పుగాకు ముక్కని ఎన్ని చుట్టలుగా రూపొందించ వచ్చునో వెంకయ్యకు తెలిసినంత బాగా మరెవరికీ తెలియదు. (ప్రస్తుతం వెంకయ్య ఈ విషయమై ఒక థీసిస్ వ్రాసి, డాక్టరేట్ కోసం ఫ్రాన్సులో ఉన్న సార్‌బోన్ యూనివర్సిటీకి పంపనున్నారని ఒక హంగ్రీ జర్నలిస్టు కథనం) ఒకొక్కప్పుడు వెంకయ్య ఆ పుగాకుముక్కలోనే తను కాల్చుకోగా మిగిలిన చుట్టను ఏ పాలేరుకైనా దానం చేస్తూ ఉండే వాడు. వెంకయ్య నిర్యాణానంతరం అతని స్మారక చిహ్నంగా ఒక చిన్న బుల్లి చలువరాతి గోరీ కట్టించడానికి విరాళాలు సేకరించే వారు అతని పుగాకు దానం సంగతి విధిగా జ్ఞాపకం ఉంచుకోవాలి. అంతే గాక వెంకయ్య స్మృతి అజరామరంగా ఉండేటట్లు చేయడానికి ప్రజలందరు అతని దానబుద్ధిని అలవర్చుకోవాలంటూ ఉద్బోధించాలి.

రోజంతా ఎద్దులా గంగిరెద్దులా గాడిదలా చాకిరీ చేసి, బస్తాలుమోసి, పద్దులు కూడా వ్రాస్తే కాని ఆ పుగాకుముక్క అయినా లభించేది కాదు వెంకయ్యకి. ఇప్పుడంతా వేరు. వారానికి ఏబులం పుగాకు అడగ్గానే మంజూరు అయింది. ఒక్క పుగాకు ముక్కతో కాలం గడిపిన కారణంచేత ఏబుఃం పేరు తల పెట్టగానే ముందు వెంకయ్యకే గుండె బేజారయింది. అడిగినంతా ఇవ్వకపోతే వెంకయ్య ఇంట్లో ప్రవేశించి, తనే స్వయంగా తీసుకుంటాడేమోనని మంగమ్మ భయపడింది.

అన్నపానాదుల విషయంలో కూడా అంతే. అదివరదాకా పథ్యపుసరకుల మీదే బ్రతుకుతూవచ్చాడు వెంకయ్య నేతిలో, వేయించిన మిరియాల పొడి. సొంఠి పొడి, మిరియాల చారు, చింతకాయ పచ్చడి, నిమ్మకాయ ఊరగాయ నిత్య నైవేద్యాలయ్యాయి. పప్పు పదార్థాలు మాత్రం అడపా తడపా తగిలేవి. కొంచెం తగు మాత్రంగా ఉప్పు, పులుపు ఉండి జిహ్వకు రుచించే సరకులు కరవైనప్పుడు పిండి వంటల మాట చెప్పడానికి ఏముంటుంది? మంగమ్మని పెళ్ళాడడానికి ముందు డబ్బు లేకా, ఆమె కాపరానికి వచ్చిన తరువాత ఆమెకు సరిపడని కారణం చేతా వెంకయ్య జిహ్వ కట్టేసుకో వలసి వచ్చింది. క్రమేపీ అతని జిహ్వ ఎండి ఇగిరి చచ్చిపోయింది. అలాంటిది మంగమ్మ వేసిన వెలితో వెంకయ్య తన సరదాలన్నీ తీర్చుకోవడం మొదలు పెట్టాడు. అతని జిహ్వ కూడా తిరిగి లేచి వచ్చింది. (మన దేశంలో ఏ టాల్‌స్టాయ్ వంటివాడో కనుక పుట్టి ఉన్నట్లయితే 'రిసరెక్షన్ ఆఫ్ వెంకయ్యాస్ పాలెట్' అనే పేరుతో ఒక మహాగ్రంథం రచించి పారేసును.)

వెంకయ్య ఎత్తుబడులన్నీ మంగమ్మ



గమనించకపోలేదు. పిసాళం నెత్తికెంటెంది. ముట్టుకుంటే మహాప్రమాదమని ఆచార్యులు గారు చెప్పారు. కాబట్టి సరిపోయింది కాని లేకపోతే ఈ విధంగా డబ్బంతా తన అబ్బ సొమ్ములా వాడుతూ ఉన్నందుకు వీనాడో దేహశుద్ధి చేసిఉండేది. ఏ చీపురైనా ఉపయోగిస్తే—ఆ జబ్బు కాస్తా చీపుర్ని అంటి పెట్టుకువచ్చి తనకు సంక్రమిస్తుందేమో అని కూడా ఆమె భయపడింది. ఆమె తన దేహశుద్ధి చేయడానికి క్షణమైనా ఆలస్యం చేసి ఉండేది కాదన్న సంగతి వెంకయ్యకు అనుభవంవల్ల బాగా తెలిసినదే. పూర్వం బాగా ఉన్న రోజుల్లో, తన కేమైనా అంతగా కావలసివస్తే, ఏ గ్రామమునసబు గారి వంటి ఘరానా మనిషో దుకాణానికి వచ్చినప్పుడు వారి ఎదుట వారికి తెలిసేటట్లు భార్యకి కబురు చేసి తన సరదా తీర్చుకునేవాడు. అయినా దేహశుద్ధిమాత్రం తప్పేదికాదు.

ఇప్పుడు వెంకయ్య పురమాయింపులు, ఆజ్ఞలు ఎక్కువ కావడంతో మంగమ్మ ఒక నిర్ణయానికి వచ్చింది. "పుల్లమ్మ పెళ్లంటూ కానియ్యి ముసలాడా, నీ సంగతి చెబుతాను" అని బెదరించింది. ఈ బెదరింపు వినగానే వెంకయ్య రహస్యంగా ఊళ్లో అమ్మవారిగుడికి పోయి "పోలేరమ్మ తల్లీ, ఆ పుల్లి ముండకి ఇప్పట్లో పెళ్లి కాకుండా చెయ్యమ్మా. నీకో కానీ అరటిపళ్లు ఇచ్చుకుంటాను" అని మహాభక్తితో మొక్కుకున్నాడు. వెంకయ్య మొక్కుబడి ఫలితమో, లేకపోతే మంగమ్మ బెదరింపుల ఫలితమో తెలియదు కాని మరి కొలదిరోజులలోనే పుల్లమ్మ పెళ్లి సంబంధం నిశ్చయమయింది.

తన తండ్రి ఆస్తి, తను భర్తచేత నానా చాకిరీ చేయించి రెట్టింపు పదిరెట్లు కూడా చేసిన ఆస్తి ఏ పరాయివాడి భుక్తమో కాకుండా తన కుటుంబంలోనే ఉండాలని మంగమ్మ అనుకుంది. ఇప్పుడు భర్త జబ్బుతో కుమార్తె పెళ్లి వెంటనే చేయవలసిన అగత్యం కూడా ఏర్పడింది. అల్లుడంటూ ఒకడు ఉంటే తన భర్త స్థానం (దుకాణంలో మాత్రమే) ఆక్రమించుకుని, నా బొందో అని ఆస్తి మరింత పెంచడం కోసం పని చేస్తాడు. వెంకయ్య వెలితో వ్యాపారం కొంచెం తగ్గింది కూడా. అందుకని తన దగ్గరనే తన ఇంట్లోనే ఉన్న తన బడుద్ధాయి తమ్ముడికే తన కూతుర్నిచ్చి కట్టబెట్టడానికి నిశ్చయించుకుంది మంగమ్మ. ఆ వెంటనే తండ్రి ఊరికి పోయి తాంబూలాలు పుచ్చుకుని, ముహూర్తం పెట్టించి, తిరిగొచ్చింది.

మంగమ్మ తమ్ముడినంగతి పెద్దభారతం అంతివుంది. ఎంతో 'డబ్బున్నా వాడి ముఖం చూచిన వాళ్లెవరూ వాడికి పిల్లనిచ్చి పెళ్ళిచేయడానికి అంగీకరించలేదు. వాడి మొఖం ఎవరికంటా పడకుండా చేయడానికి, ఆ విషయం తెలియకుండా డబ్బు చూచే వారిని మభ్యపెట్టడానికి వాణ్ణి అక్క


జెక్ స్లోకియాలో ప్రఖ్యాతిగాంచిన 'స్కోడా' కంపెనీవారిచే తయారుచేయబడిన



ట్రాక్టర్లు,

డీజిలు

యింజన్లు

స్కోడా డీజిలు యింజను 5 నుండి 85 హార్సుపవరు వరకు కోల్డు స్టార్టింగు హారిజెంటల్ మరియు వర్టికల్—

★



26 హార్సుపవర్ "జెటర్" ట్రాక్టరు డీజిలు ఆయిలుతో పని చేయును. బొంబాయి ప్రభుత్వమువారితో ప్రత్యేక సర్టిఫికెట్టు పొందినది. అన్ని రాష్ట్రములలో ప్రసిద్ధిగాంచినది. దీనిపైజు గల అన్ని ట్రాక్టరుల కంటె ఖర్చుతక్కువలో ఎక్కువ పని చేయును. ధర తక్కువ. నవీనపద్ధతులతో తయారు చేయబడినది. వాయిదాల పద్ధతిమీద కూడా యివ్వబడును. విడిభాగములు, సర్వీస్ ఎల్లప్పుడు లభించును. ట్రాక్టర్లకు పనికివచ్చు అన్ని వ్యవసాయ పనిముట్లున్నూ, ట్రైలర్లు దొరకును. ఒకసారి మా షో రూముకు దయచేసి చూడండి.

యేజంట్లు: కృష్ణా, గుంటూరు, తూర్పు, పశ్చిమ గోదావరి, విశాఖపట్టణం జిల్లాలకు

# ది పద్మజా కమ్మర్షియల్ కార్పొరేషన

ప్రొప్రయిటరు: వల్లూరుపల్లి కేశవరావు చౌదరి

S. B. 42. కాశేశ్వరరావు మార్కెట్టు, విజయవాడ 1.

(మంగమ్మ)గారింట్లోనే చాలకాలంగా ఉంచారు తలిదండ్రులు. కాని, ఆ ప్రయత్నాలు కూడా సంపూర్ణంగా వ్యర్థమయ్యాయి. అప్పటికే వాడి ముఖసౌందర్యం గురించి దేశంలో కథలుగా గాథలుగా చెప్పుకుంటూ ఉండడంచేత ఆతలి దండ్రుల మనోరథం ఈడేరిందికాదు. ఇక పిల్లవాడికి పెళ్ళి చేయకుండానే, లోకానికి దిక్కు లేకుండా చేసి పోవలసి వస్తుందేమోనని ఉదారస్వభావులైన ఆ తలిదండ్రులు విచారిస్తూఉండగా మంగమ్మ తన కూతుర్ని చేసుకోమని అడగడానికి చక్కా వచ్చింది.

మరొకప్పుడయితే, అంటే సౌందర్యఖని అయిన తమ సుపుత్రుని కీర్తిచంద్రికలు లోకంలో వ్యాపించకముందు వారు ఏమైనా వెనుదీయడమో, శట్టుచేయడమో సాగించేవారేమోకాని ఇప్పుడు తీరా విరక్తితో సన్యాసం స్వీకరించినసమయంలో తమ అగ్ర తనూజ ఈ విధంగా కోరడంతో వారు వెంటనే అంగీకరించి, అల్లుడు రాకపోయినా కూతురితోనే తాంబూలాలు తీసుకున్నారు.

ఇది వెంకయ్యకు అశనిపాతంలా తోచింది. షావుకారుగా పుట్టాడుకనుక సరిపోయింది కాని లేకపోతే ఆత్మహత్య చేసుకునే వాడేమోకూడ. అదే కారణంచేత అంతటి దుర్వార్తలోకూడా అతనికి సంతోషించదగిన విషయం ఒకటి గోచరించింది. పుల్లి అంటే వెంకయ్యకు ఏనాడూ మక్కువ ఏమీ లేదు. పుల్లిగుణాలు, రూపురేఖా విలాసాలు మూడుమూర్తులా మంగమ్మవే. మాటలువచ్చి నడవడం మొదలుపెట్టిన రోజునుంచి తల్లీలాగే తండ్రిమీద అధికారం చెలాయించేది పుల్లమ్మ. ఎప్పుడైనా ఏరవంత చింతపండయినా, బెల్లంముక్క అయినా చిరుదిండి తినడంకోసం తనదగ్గరికి వచ్చి తనతో మాట్లాడేది. కాని ఇతరసమయాలలో తనపొడఅయినా కిట్టేదికాదు పుల్లమ్మకి. భార్యామణి చూడకుండా మరోపుగాకు ముక్క తుంపి రొండిని పెట్టుకుంటే ఆవార్త కాస్తా తల్లికిచేరవేసి శాపనార్థాలు పెట్టించేది కూడా. అలాంటి సుగుణఖనిఅయిన కుమార్తె ఈ విధంగా తిరిగి భార్యకుటుంబంలోచేరి పోవడం, అన్నిటినీమించి మన్మథుడులాంటి బావమరదిని పెళ్ళిచేసుకోబోవడం ఎందుచేతనో తగిన శాస్తిలా తోచి వెంకయ్య మనస్సుకి రవంత శాంతి చేకూరింది. అంతలోనే ఈ పెళ్ళి కాస్తా అయిపోతే తనగతి ఏంకాను, ముందున్న ముసళ్ళ పండగ స్వరూపం ఎలా ఉంటుంది అనే భయం వెంకయ్యకి ఒక్కొక్కనాడు నిద్రకూడ పట్టకుండా చేసేది. తామర పుష్కలంగా శరీరమంతా వ్యాపించిన తదాది వెంకయ్యకు నిద్రపోయేఅలవాటు ఏనాడోతప్పిపోయింది. పగలు, రాత్రికూడా పనిలేనప్పుడల్లా, అలా చుట్ట నోటిలో పెట్టుకొని, మాగన్నుగా ఉండి, సమాధిలో ఉన్నట్టుగా కనపడుతూ తపస్సుచేస్తూ ఉండేవాడు వెంకయ్య. అందుకే అతనికి నిజంగా నిద్రపట్టిందోలేదో తెలుసుకోవడం బ్రహ్మకైనా తరంకాకపోవడంచేతనే వెంకయ్యదుకాణంలో ఏనాడూ దొంగతనాలు జరుగలేదు.

తలవని తలంపుగా ఈ పెళ్ళివార్త ఒక్కరికిమాత్రం మహా సంతోషం చేకూర్చిందని చెప్పకతప్పదు. అది పుల్లమ్మకే. అదేమో కాని, పుల్లమ్మకి చిన్నప్పటినుంచి ఆ మామ సాంగత్యం రుచించినట్లు మరెవరి పొడా కిట్టేదికాదు. సర్వకాల సర్వావస్థల్లో ఆ మామ సాన్నిధ్యంలోనే కనపడేది. ఇక పెళ్లయితే మామని ఎప్పటికీ విడిచిపెట్టక్కర్లేదుకదా అనేసంతోషం ఎక్కువై పుల్లమ్మ ఇంట్లో అందరిమీదా మహా అధికారం చలాయించడం మొదలుపెట్టింది. ఇక ఈ కథని ఇలా ఆనందంగా పొడిగించడం అర్థంలేని విషయం. అందుచేత నాలుగు మాటల్లో ముగించి వేస్తాను.

ఒక శుభముహూర్తాన సకల సద్గుణ సమన్విత రూపవతి అయిన పుల్లమ్మ వివాహం అంతా ఓహో అనేటంత వైభవంగా జరిగింది. ఒకరకంగా మంగమ్మ కోరిక అప్రయత్నంగా నెరవేరింది. వెంకయ్య గుండె మాత్రం బ్రద్దలయింది. ఎన్నోడక్కాముక్కాలు తిని ఓర్చిన వెంకయ్య గుండె సామాన్యమైన దేమీ కాదు. కంచువజ్ర సన్నిభమైనది. అలాంటిది ఆకస్మికంగా బ్రద్దలుకావడానికి తగినంతటి విశేషమైన కారణం ఒకటి ఉండాలి కదా !

పుల్లమ్మ పెళ్లికివచ్చిన బంధువుల్లో ఇంగ్లీషు వైద్యం చదువుకున్న ఆసామీ ఒకరున్నారు. ఆయనగారు తనకేమీ అవసరంలేకపోయినా, ఎవరూ కోరకపోయినా తన పాండిత్యం వెలగబెట్టుకుందుకు, వెంకయ్య వెలిసంగతి తెలుసుకొన్నట్టువంటి వాడై, వెంకయ్యని పరీక్షచేసి, వెంకయ్యకి తామరతప్ప మరేవ్యాధి కాని లేదని సశాస్త్రీయంగా ఋజువు చేశాడు. మంగమ్మకి ఇంగ్లీషుచదువుల్లాంటి పిచ్చిపిచ్చి వాట్లల్లో నమ్మకమేమీ లేదు.

అయినా పదిమంది జుట్టు పట్టుకొని లాంగదీసి తనుమాట వినేవరకు విడిచిపెట్టకపోవడంచేత విధిగా ఆ ఇంగ్లీషువైద్యుడి రోగనిదాన ఫలితం అంగీకరించక తప్పలేదు. దీనికి మరొక కారణంకూడా ఉంది. చర్మవ్యాధి బాధితులు ఎవరయినా పదే పదే వస్తే అది పెద్దజబ్బని చెప్పి, వారిపీడ వదుల్చుకొనడం ఆచార్యులుగారికి పరిపాటనికూడ తరువాత తెలిసింది.

వెంకయ్య తన స్వాతంత్ర్య సౌఖ్య సౌభాగ్యాలు కోల్పోయినవాడై తిరిగి మంగమ్మ చెరసాలలో ప్రవేశించాడు. ఆ రోజునే తన వెలికాలంలో పెట్టిన దుబారా ఖర్చులకు ప్రతిఫలంగా దేహంకూడ శుద్ధి చేయించుకొని పరిపూర్ణుడయ్యాడు. అదే వెంకయ్య గుండె బ్రద్దలు కావడానికి గల కారణం. పుల్లమ్మ, భర్తమాత్రం సుఖంగా పుత్ర పౌత్రాభి వృద్ధిగా జీవిస్తున్నారు. ★

ప్రపంచ ప్రఖ్యాత మద్రాసు నశ్యం

★ ★

నాణ్యతయే దానిఘనత



ఒకసారి కొంటే తిరిగి వదలిపెట్టరు

★ ★

నశ్యములలో ఉత్తమమైనది పట్నం నశ్యమే. కాని అత్యుత్తమమైనది, అందరూ కోరునది, కారం, నాణ్యత, సువాసన గలది. అప్పాదురై నశ్యమె

అ. అప్పాదురై ముదలియార్ & సన్

ఆచారప్పన్ వీధి, పోస్టుబాక్సు నెం. 189, మద్రాసు-1.